**సమస్యలుంటే సాక్షికి చెప్పండి**

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**97053 47483**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న గ్రీవ్ అండ్ సేవ్ మెనీ సభ్యులు

**ఆరిలోవ:** డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో గ్రీవ్ అండ్ సేవ్ మెనీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథ బాలురకు ఆరోగ్యం, పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వివరించారు. శరీరాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. అనంతరం పారిశుద్ధ్యానికి అవసరమైన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవదూత కృతజ్ఞతలు తెలిపారు.

### క్రిటికల్ థింకింగ్‌పై పోటీ పరీక్షలు

**బీచ్ రోడ్డు:** విద్యార్థుల్లో సామర్థ్యాన్ని వెలికితీసేందుకు క్రిటికల్ థింకింగ్‌పై హెచ్‌సీఎల్ జిగ్సా 4వ సీజన్ పోటీ పరీక్షలు నిర్వహించనున్నట్టు హెచ్‌సీఎల్ ప్రతినిధి రజత్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్లగా హెచ్‌సీఎల్ జిగ్సా పేరుతో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.12 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ నెల 3 నుంచి జూలై 31వ తేదీ వరకు క్వాలిఫైయర్లు పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూలై 31వ తేదీలోగా hcljigsaw.com వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

### సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పొందిన బాలురకు సర్టిఫికెట్లు అందిస్తున్న జనసంస్థాన్ సభ్యులు

**ఆరిలోవ:** ముడసర్లోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహంలో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడు నెలలు పాటు ఇచ్చిన జ్యూట్ బ్యాగుల శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన బాలురకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు గొండు సీతారాం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జనకులం సంస్థ చైర్మన్ సత్యదేవ్, సంస్థాన్ డైరెక్టర్ జి.అప్పలనాయుడు, గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### అందరి ఆరోగ్యమే డబ్ల్యూహెచ్‌వో లక్ష్యం



ఆరోగ్యంపై అవగాహన పోస్టర్లు ప్రదర్శిస్తున్న చిన్నారులు

**మద్దిలపాలెం:** అందరి ఆరోగ్యమే ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) లక్ష్యమని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి. రత్నం అన్నారు. మద్దిలపాలెంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరోగ్యంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జె.వి.రత్నం మాట్లాడుతూ ఈ నెల 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని అందరూ పాటించాలన్నారు. డబ్ల్యూహెచ్‌వో ఈ ఏడాదిని అందరికీ ఆరోగ్యం అనే థీమ్‌తో కార్యక్రమాలను నిర్వహించనుందన్నారు. మద్దిలపాలెం జీవీఎంసీ పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పండిన పంటలను ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పోస్టర్లతో చిన్నారులు ప్రదర్శన నిర్వహించారు.





కరకచెట్టు పోలమాంబ ఆలయం బయట భక్తుల సందడి



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ



అమ్మవారికి పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి దంపతులు

# పోలమాంబ.. పాహిమాం

- వైభవంగా శ్రీకరకచెట్టు పోలమాంబ అనుపు మహోత్సవం
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక వేషధారణలో కళాకారులు

**ఏయూ క్యాంపస్ :** శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ అనుపు మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు నుంచి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి పోలమాంబ ఆలయంలో అనుపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. సోమవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టు పక్కల 14 గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు, పెదవాల్తేరు గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం నుంచి పోలమాంబ ఆలయానికి వెళ్లే మార్గం సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొంత మంది ఘటాలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఆట వస్తువులు, చెరకుగడలు, బొమ్మల విక్రయ స్టాళ్లు ఏర్పాటు చేశారు.

**అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు**

పోలమాంబ అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఏర్పాట్లపై సంతృప్తి**

పోలమాంబ పండగలో చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సంతృప్తి వ్యక్తం చేశారు. బాలింతలు చిన్నారులకు పాలివ్వడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు, పిల్లలకు పాలు పంపిణీ, చిన్నపిల్లల వైద్యులను అందుబాటులో ఉంచడం, ప్రాథమిక చికిత్స అందించే సదుపాయం కల్పనపై హర్షం వ్యక్తం చేశారు.



పోలమాంబ అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి చూస్తున్న భక్తులు



కళాకారుల విన్యాసం

# సందడిగా అమ్మవారి జాతర



సంజయ్‌గాంధీ కాలనీలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

**ఆరిలోవ:** ఆరిలోవ ప్రాంతంలో మంగళవారం పోలమాంబ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఈ ప్రాంతంలో ఆరు చోట్ల పోలమాంబ ఆలయాలు ఉన్నాయి. ఆయా చోట్ల పండగ వాతావరణం నెలకొంది. ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఆపరేషన్ కాలనీ, దీన్‌దయాల్‌పురం, చినగదిలి, సూర్యతేజానగర్, పెదగదిలి, సంజయ్‌గాంధీ కాలనీల్లో కొలువుదీరిన పోలమాంబకు వారం రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన పండగ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, కానుకలు చెల్లించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాల వద్ద నిర్వాహకులు క్యూలు ఏర్పాటు చేశారు. మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. పెదగదిలిలో పోలమాంబ అమ్మవారిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బుడుమూరు గోవింద్, సభ్యులు దర్శించుకున్నారు. సంజయ్‌గాంధీ కాలనీలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, 9వ వార్డు కార్పొరేటర్ స్వాతి, ఆలయ అధ్యక్షుడు కంచుమర్తి నాగరాజు, సభ్యులు దర్శించుకున్నారు. సూర్యతేజానగర్‌లో 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఆలయ కమిటీ సభ్యులు.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆయా ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, పరస నిర్వహించారు. ఆరిలోవ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పెదగదిలిలో పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి దంపతు

**ఆరిలోవ:** విశాలాక్షినగర్‌లో పోలమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరకు అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి శాలిని హాజరయ్యారు. పూర్ణ కుంభం తలపై మోసుకెళుతూ పోలమాంబను దర్శించుకున్నారు. ఈ పూజల్లో ఆర్‌ఐలు రామకృష్ణారావు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.



విశాలాక్షినగర్‌లో పోలమాంబ పూజకు పూర్ణకుంభంతో వెళ్తున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలిని

## ఉక్కు పోరాటం భావితరాలకు మార్గదర్శకం



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

**కూర్మన్నపాలెం:** విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగార పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 782వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఎంతో మంది ప్రత్యక్షంగా, లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు గత వారం ఢిల్లీలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులను కలిశామని, ఉక్కు పరిరక్షణకు సహకరించాలని విన్నవించామని తెలిపారు. ఉక్కు పరిరక్షణకు భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కూర్మన్నపాలెంలో టెంట్ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీన పాదయాత్ర ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 25న సీఎండీ బంగ్లాను ముట్టడిస్తామని, ఈ కార్యక్రమాల్లో కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## వేతన ఒప్పందం అమలుకు డిమాండ్



ధర్నాలో ప్రసంగిస్తున్న సీఐటీయూ నాయకులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం చేయాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి.దాస్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్ మెల్ట్ షాప్ విభాగాధిపతి కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈవోఐను కార్మికవర్గం ఐక్యంగా వ్యతిరేకించాలని కోరారు. అనంతరం విభాగాధిపతి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మిత్రపక్షాల నాయకులు డి.వి.రమణారెడ్డి, కర్రా ప్రకాశ్, బి. అప్పారావు, మరిడయ్య పాల్గొన్నారు.

## సర్వజన మనోరంజనిపై అప్పన్న తిరువీధి

**సింహాచలం:** సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామికి సర్వజన మనోరంజని వాహనంపై తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా మనోరంజని వాహనంపై అధిష్ఠంపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు పవన్‌కుమార్, కుమార్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారిణుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.



సర్వజన మనోరంజనిపై తిరువీధిలో అప్పన్న

## ఎన్‌ఏడీలో విస్తృత తనిఖీలు

**గోపాలపట్నం:** నగరంలో చైన్ స్నాచింగ్ జరిగిన నేపథ్యంలో గోపాలపట్నం , ఎన్‌ఏడీ ప్రాంతంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బుచ్చిరాజుపాలెం ఎన్‌ఏడీ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం పోలీసులు తనిఖీలు ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. వాహన దారుని వివరాలు, వాహనం పత్రాలు పరిశీలించారు. అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించారు.

## ఉత్సాహంగా నృత్య ప్రదర్శనలు



డాన్స్ బేబీ డాన్స్‌లో నృత్యం చేస్తున్న యువత

**ఎంవీపీ కాలనీ:** శ్రీకరకచెట్టు పోలమాంబ పండగలో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-9 అప్పుఘర్‌లో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీపోలమాంబ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసవానిపాలెం ఆధ్వర్యంలో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం స్థానికులను అలరించింది. పలు సినీ గీతాలకు నృత్యాలు చేస్తూ కళాకారులు ఊర్రూతలూగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నా రు. కార్యక్రమంలో ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**6న సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

## 'జగనన్నే మన భవిష్యత్తు' నినాదంతో ప్రజల్లోకి..

**మద్దిలపాలెం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో జయప్రదం చేయాలని జీవీఎంసీ 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పిలుపునిచ్చారు. సింహాద్రిపురంలోని వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం వార్డులోని సచివాలయ సిబ్బంది, పార్టీ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఈ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్ల ఇన్‌చార్జి శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, సచివాలయ కన్వీనర్లు నరాల సత్తిబాబు, గొట్టివాడ నారాయణ, గొలగాని త్రినాథ్, బుగత మేర్సీ, మరియమ్మ, ఉషా, సురేష్, వెంకటలక్ష్మి, వాసు, రమేష్, అచ్యుత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

## 'మద్ది వారి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు'

**ఏయూ క్యాంపస్:** తరతరాలుగా పెదవాల్తేరు పోలమాంబ అమ్మవారిని పూజిస్తున్న మద్ది వారి కుటుంబాన్ని దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు నిర్లక్ష్యం చేయడం తగదని మద్ది వారి కుటుంబ సభ్యుల సంఘం సలహాదారుడు మద్ది శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం పెదవాల్తేరు బజార్‌లోని మద్దివారి పెద్దిల్లు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలమాంబ జాతరకు ప్రతి ఏటా మద్ది వారి కుటుంబాలకు 120 వరకు దర్శన పాసులు ఇచ్చేవారన్నారు. కానీ ఈ ఏడాది పాసులు ఇవ్వలేదని, ఇలా అయితే తమ కుటుంబీకులు అమ్మవారిని ఎలా కొలుస్తారని ప్రశ్నించారు. సుమారు 400 ఏళ్లుగా అమ్మవారిని తమ ఇంటి కుల దేవతగా భావించి కొలుస్తున్నామన్నారు. ప్రస్తుత దేవస్థాన ధర్మకర్తల మండలి పాత సంప్రదాయాలు, పద్ధతులను తుంగలోకి తొక్కడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో మద్ది పార్వతమ్మ, మద్ది రామిరెడ్డి, మద్ది అచ్చెన్నరెడ్డి, మద్ది పోలిరెడ్డి, మద్ది త్రినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దివారి కుటుంబ సభ్యులు

## సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

**గాజువాక :** ఈ నెల 15, 16 తేదీల్లో గాజువాకలో నిర్వహించనున్న సౌత్ ఆసియా బాడీ బిల్డింగ్ పోటీల పోస్టర్‌ను కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ దేశాల నుంచి 200 మంది బాడీ బిల్డర్లు పాల్గొంటున్న ఈ పోటీలను విశాఖ బాడీ బిల్డర్లందరూ జయప్రదం చేయడానికి సహకరించాలని కోరారు.

## గర్భిణులు, బాలింతల బాధ్యత ఆశ వర్కర్లదే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పురేంద్ర

**కంచరపాలెం:** గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల ఆశ వర్కర్లు చిత్తశుద్ధితో పని చేయాలని డీటీసీవో ప్రోగ్రాం అధికారి డాక్టర్ పురేంద్ర అన్నారు. మంగళవారం భవానీ గార్డెన్స్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో శివనగర్, ఆర్పీపేట, భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీల ఆశ వర్కర్లతో ×ఆశ డే౯కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లు క్లస్టర్లలో మహిళల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. పౌష్టికాహారానికి సంబంధించిన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఏఎల్ శాంతి, ఏఎం ఏంజెలినా, పీఆర్‌వో శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.